## 99. సకల సంపదల నోము కథ

ప్రతి శుక్రవారం శిరస్నానం చేసి పూజాపీఠంపై లక్ష్మీదేవిని ఉంచి ఆరాదించాలి. ప్రతి శుక్రవారం శ్రీ లక్ష్మీదేవిని ఆరాధించి పూజరోజున ఒక్కపూటమాత్రమే భోజనం చెయ్యాలి. ఇలాఅయిదుసంవత్సరాలుచేయాలి. తదుపరి అయిదుగురు ముత్తైదువులను ఆహ్వానించి కాళ్ళకుపసుపురాసి బొట్టు,కాటుకపెట్టిదక్షిణతాంబూలములతో రవికెల గుడ్డలిచ్చి వాళ్ళకి పాదాభివందనం చేసి వాళ్ళ ఆశీస్సులు పొందాలి.

నియమ నిష్టలతో ఈ నోము నోచుకున్న వారికి ఆ శ్రీలక్ష్మీ అనుగ్రహం సిద్ధించి సకల సౌభాగ్యాలు, సౌఖ్యాలు కలిగి ఇహ పరలోకాల్లో తరిస్తారు.

## 100. నవగ్రహ దీపాల నోము కథ

కార్తీకమాసంలో శివాలయంలో అభిషేకం చేయించి గణపతిని ఆరాధించాలి. పైడివత్తులను తొమ్మిది ప్రమిదలలో ఒక్కొక్క ప్రమిదలో తొమ్మిది చొప్పున ఉంచి వెలిగించాలి. ఆతొమ్మిది జ్యోతుల దగ్గర నవధాన్యాలను ఒక్కొక్క ప్రమిదవద్ద ఒక్కొక్క రకం ఉంచి ఒకొక్క దాన్ని ఒక్కొక్కరికి చొప్పున తొమ్మండుగురు బ్రాహ్మణులకు దక్షిణతాంబూలాలతో ఇచ్చి వారిని సత్కరించాలి. శక్తిమేరకు బ్రాహ్మణులకు భోజనం పెట్టి వాళ్ళ ఆశీస్సులు పొందాలి.

ఇలాచేయడం వల్ల నవగ్రహాల అనుగ్రహం కలిగి అష్టైశ్వర్యాలను పొందుతారు. ఈతిబాధలు తొలగి సుఖశాంతులతో జీవిస్తారు.

## 101.మాఘగౌరీ నోము కథ

ఈ నోమును పేరంటాళ్ళు మాఘమాసారంభంనుండిఅనగా మాఘ మాసం మొదటిరోజైన పాఢ్యమినాటి నుండి ఆమాసం ఆఖరు రోజున అనగా మాఘ అమావాస్య వరకుముప్పది రోజులునోచుకొనవలెను. ప్రతీరోజూ శుచిగాస్నానం చేసి పూజామందిరం లో గౌరీదేవి పటము ఉంచుకుని అమ్మవారిని పసుపు కుంకుమ పువ్వులతో పూజించాలి. ఆఖరురోజున అనగా నెలాఖరున గౌరీదేవిని నీళ్ళలో విడిచిపెట్టాలి.

**ఉద్యాపన :-** శక్తికొలది తగు మంది పుణ్యస్త్రీలకు భోజనం పెట్టి పసుపు కుంకుమ దక్షిణతాంబూలాలిచ్చి నమస్కరించి వాళ్ళ ఆశీస్సులు పొందాలి.

## 102. త్రినాధుని నోము కథ

పూర్వాకాలంలో ఒకనిరుపేదవిప్రుడుండేవాడు. అతనికిలేకలేక ఒకకుమారుడు కలిగాడు ఆబిడ్డడికి తల్లి వద్ద చాలినన్ని పాలు లేక ఆకలితోఅలమటించుచుండేవాడు. ఒకఆవును సంపాదిస్తేబిడ్డకిపాలఇబ్బందిఉండదని నిర్ణయించుకున్నాడు. అందుకుగాను ఇంటిలో గల కొద్దిపాటి మంచాలుకుంచాలు అమ్మి వచ్చిన సోమ్ముతో సంతకు బయలు దేరాడు. ఏవెలకైనా పాడి ఆవును కొనాలని ఆబ్రాహ్మణుడు సంతలో తిరుగుతున్నాడు.

సంత జరిగే ప్రాంతానికి సమీపాన గల గ్రామంలో ఒక సంపన్నుని ఆవు ఇరుగు పొరుగు వారి పొలాలను పాడుచేస్తుండేది. నిత్యం తగువులు తీర్మానాలతో విసిగిపోయిన



అతడు దానిని ఎవరికైనా ఇచ్చి వేయాలని ఎంతగానో ప్రయత్నించాడు. దానిని తీసుకోగలందులకు ఎవ్వరూ ముందుకురాలేదు. సంతకు తోలుకు వెళ్తే దీని సంగతి తెలియని వారు ఖరుదు చేస్తారని నిశ్చయించుకుని ఆ సంపన్నుడు దానిని సంతకు తోలుకు వచ్చాడు. ఏ వెలకైనా అమ్మాలని అతడు, ఏవెలకైనా కొనాలని విప్రుడు సంతలో తారసపడ్డారు. వదిలిపోతే చాలని అతడు దొరికితేచాలని ఇతడు ఉన్నందున ఆ ఆవు బ్రాహ్మణునకు అమ్మబడింది.

దానినితోలుకునిస్వగ్రామానికి బయలుదేరినవిప్రుడు ఆనందపారవశ్యంలో ఆదమరచి ఉండగా ఆ ఆవు తప్పించుకుని పారిపోయింది. అది దొరకక విప్రుడు ఒక చెట్టు నీడను కూర్చుని విచారిస్తున్నాడు విచారించి విచారించి తిరిగి సంతకు వెళ్ళి వెదకాలని దాని యజమాని వైనం తెలుసుకుని అతని ఇంటికి గాని వెళ్ళిందేమో తీసితెచ్చుకోవాలని నిర్ణయించుకుని బయలు దేరాడు.

అలా వెళ్తున్న ఆ బ్రాహ్మణునకు త్రిమూర్తులు సాక్షాత్కరించి ఓయీ ! నీవు ఎక్కడికి వెడుతున్నావని ప్రశ్నించారు. ఆవునువెదకుటకు వెళ్తున్నాను అని విప్రుడు సమాధానం చెప్పాడు. నువ్వు సంతదిక్కుగా గ్రామానికి వెళ్తున్నావు గనుక నీవు తిరిగి వచ్చేటప్పుడు గంజాయి,ఆకు,వక్క నూనె తెచ్చి పెట్టవలసిందని మూడు పైసలిచ్చారు త్రిమూర్తులు. అలాగేనని అంగీకరించి విప్రుడు సంతలో ఆవు అగుపించక తిరిగివస్తూ తెలికలగానుగకు వెళ్ళి ఒకపైసానూనెఇమ్మనిచెంగుచాపాడు. ఈతడెవరో అమాయకుడని ఆలోచించి ఆగానుగయజమాని సోలనుతిరగేసి నూనెను అతని చెంగులోనికి కొలిచాడు. ఆవిప్రుడు కొట్టుదిగేసరికి ఆ తెలికలవాని పాత్రల్లో నూనె అంతా మాటుమాయ మయ్యింది. అతడు లబోదిబోమని మొరపెట్టుకోగా చుట్టు ప్రక్కల వారంతా చేరి విషయాన్ని తెలుసుకున్నారు. విప్రుడ్ని మోసగించిన కారణం వల్ల ఆలా జరిగిందని గ్రహించారు. అతడ్ని వెతుక్కుంటూ వెళ్ళి కిరాణాకొట్టు మీద ఆకువక్కలు కొనుక్కుంటున్న ఆ విప్రుడ్ని చూచి అయ్యా ! మీకు నూనె కొట్టాయన తక్కువ కొల్చాడట రండి సరిగాకొలిచిస్తాడట అని చెప్పి తీసుకువెళ్ళి నూనె ఇప్పించారు. అతడు తిరిగి వస్తుండగా త్రిమూర్తులు కనబడి అయ్యానువ్వు మాకొరకై తెచ్చిన వస్తువులతో త్రినాధపూజ చెయ్యి నీకష్టాలుతొలగుతాయి అని ఈ పూజలో నీకేమి ఖర్చుండదని చెప్పి పంపించారు. అతడు ఇంటకి వెళ్లి త్రినాధ పూజను గురించి భార్యకు చెప్పిదంపతులిద్దరూకూడా భక్తి శ్రద్ధలతో పూజచేసారు. త్రిమూర్తులు పూజచేయడంవల్ల పోయిన ఆవు దొరికింది. ఆ ఆవు అల్లరిచిల్లరిగాతిరగడం మాని చక్కగా పాలివ్వసాగింది. బిడ్డడి పాల బెడద తీరింది. ఆయవారంవల్ల తిధి వార నక్షత్రాలు చెప్పడంవల్ల కొద్దో, గొప్పో ధనం ముట్టి వారి ఆర్థిక ఇబ్బందులు తొలగనారంభించాయి. ఈ పూజ చేసినవారికి సంసార సంభందమైన ఇబ్బందులు తొలగి జీవితం ప్రశాంతంగా సాగుతుంది.

## 103. చల్ల చిందు నోము కథ

ఈ నోము నోచిన వారి బ్రతుకు చల్లగా ఉంటుంది. సిరిసంపదలుతో సుఖ సౌఖ్యాలతో హాయిగా సంతోషంగా జీవిస్తారు. ఈ నోమును గురించి దాని విధివిధానాలను వ్రతనియ మాలను వ్రతమహిమను గురించి శివుడు పార్వతిదేవికి ఉపదేశించాడు. ఆనోటా ఆనోటా ఈనోమును గురించి విన్న స్త్రీలు భక్తితో ఈ వ్రతం ఆచరించి సుఖసంతోష సౌఖ్యాదులతో

జీవిస్తున్నారు. ఇంటింటా మజ్జిగను చిలుకు కునేవారు అలాచిలుకునేటప్పుడు నేలరాలిపడ్డ మజ్జిగను ప్రోగుచేసి అందులో పసుపు కలిపి నిత్యం అయిదుగురు పేరంటాళ్ళకు కాళ్ళకు వ్రాయాలి. ముఖానికి పూయాలి. అలా ప్రతిరోజూ ఒక ఏడాదికాలం పాటు చేసి ఆఖరు రోజున ఇంటపాలు తోడుపెట్టి మజ్జిగగా చిలికి వెన్నను తీసి ఉంచి ఒక ముత్తైదువునకు దక్షిణ తాంబూలాలతో వెన్నను మజ్జిగను వాయన మిచ్చి అమెకు భోజనం పెట్టాలి.

## 104. చిక్కుళ్ళ గౌరి నోము కథ

**" చిక్కుళ్ళ గౌరీ నోము నోచిన వారికి ఏవిధమైన చిక్కులు ఉండవు.**
**చిక్కుళ్ళ నోము నోచే నాకు చిక్కులు తీరు,**
**చిక్కుళ్ళనోము వల్ల సిరిసంపదలు కలుగు,**
**చీకూ చింతా లేకుండా చల్లగా బ్రతికెదను."**

అని చెప్పుకుని అక్షంతలు నెత్తిన జల్లుకోవాలి. అలా సంవత్సరం పాటు ఉదయమే స్నానం చేసి భక్తితో విశ్వాసంతో ఈ మాటలు అంటూశిరస్సున అక్షింతలు చల్లుకోవాలి. ఈ నోమునోచేపేరంటాలు ఏడాదిపూర్తికాగానే వెండితోగానిబంగారంతో గాని చిక్కుళ్ళు చేయించి బ్రాహ్మణునకు దానమివ్వాలి. ఆఖరున నలుగురు పేరంటాళ్ళకు నవగాయ పిండివంటలతో భోజనం పెట్టాలి.

## 105. చిట్టి బొట్టు నోము కథ

పూర్వకాలంలో ఒకానొక పడతి ఇరుగుపొరుగువారితో చీటికిమాటికీ గొడవలు పెట్టుకుంటుండేది. ఏ ఒక్కరితోనూ మంచిగా (పొత్తుగా) ఉండేది కాదు అందరితోను విరోధంగా ఉండేది. ఆమెకు ఎవరు చెప్పారో ఎలా ఉద్దేశంకలిగిందోచిట్టి బొట్టు నోము నోచింది నోము నియమానుసారం అయిదుగురు పేరంటాళ్ళకు బొట్టు పెట్టాలి. అందుకుగాను పిలువబడే పేరంటాళ్ళతో ఏ ఒక్కరితోను ఆమెకు పొత్తు కించిత్తు కూడా లేదు. ఎలగైతేనే నలుగురికి బొట్టు పెట్టింది. అయిదవ ఆమెకు బొట్టు పెట్టబోయే సమయంలో ఆమెలోని జగడపు బుద్ధి ప్రజ్వరిల్లి ఆమెకు బొట్టు పెట్టకుండా కసిరి కొట్టింది. ఆవేశం ఆపుకోలేక తన బొట్టు తుడిచేసుకున్నది. ఆవిధంగా చిట్టి బొట్టు నోముకు ఉల్లంఘన జరిగింది.

మురుజన్మలో ఒక బ్రాహ్మణుని ఇంట జన్మించింది. ఆదంపతులు ఆమెను అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. కాని ఆబిడ్డ ముఖాన బొట్టు నిలబడేదికాదు. ఎంత ప్రయత్నించినా ఎలా ప్రయత్నించినా ఎన్నిసార్లు పెట్టినా ఆబిడ్డ నుదుట బొట్టునిలిచేది కాదు. ఈవైపరీత్యానికి ఆ దంపతులు ఎంతగానో బాధపడుతుండేవారు. ఒకనాడు ఆ గ్రామానికి వచ్చిన త్రికాలజ్ఞానియైన ఒక యోగిని దర్శించి ఆ దంపతులు తమ బిడ్డవిషయం చెప్పి వైధవ్యప్రాప్తి ఉన్నదేమో అన్నభయాందోళనలను విన్నవించుకుని తరుణోపాయం చెప్పవలసినదని ప్రార్థించారు. అంతట ఆ యోగి తనమనోనేత్రంతో విషయాన్ని గ్రహించి దంపతుల్లారా విచారించకండి గతజన్మలో మీ బిడ్డ పరమగయ్యాళి ఎవరితోను మంచిగా పొందికగా ఉండేదికాదు. అందరితోను గొడవలు పెట్టుకునేది. ఈగొడవలుమానిచిట్టి



బొట్టునోమునునోచిపేరంటాళ్ళకు బొట్టు పెట్టడంలోఒకముత్తైదు వునువదిలివేయడమే గాకుండా తనబొట్టును కూడా చెరుపుకుని వారందరినీ కసురుకున్నది. ఆకారణంగా ఆమెకు నుదుటబొట్టునిలవడంలేదు మీరామెచేత చిట్టి బొట్టునోము నోయించండి పరిస్థితి చక్కబడుతుందని వైధవ్యప్రమాదం తప్పుతుందని చెప్పాడు.

ఆప్రకారం ఆదంపతులు తమ బిడ్డచేత చిట్టి బొట్టు నోమును నోయించారు. బొట్టు రాలిపడకుండా నుదుట యందు అమరుకున్నది. గుణవంతుడు, రూపవంతుడైన యువ కునితో ఆమెకు వివాహం జరిగింది. ఈ నోము నోచుకున్నవారి బొట్టు చెదరక మంచి దాంపత్యసౌభాగ్యం కలుగుతుంది.

**ఉద్యాపన :-** సంవత్సరకాలంపాటు వారం వారం అయిదుగురు పేరంటాళ్ళకు బొట్టు పెట్టాలి. వారిచే అక్షింతలు శిరస్సున జల్లించుకుని వారికి పాదాభివందనంచేసి వారి ఆశీర్వచనాలు పొందాలి.

## 106. గర్భిణి గౌరి నోము కథ

పూర్వకాలంలో ఒకానొక సంపన్నురాలికి ఎంతకాలం గడిచినా సంతానం కలగలేదు. ఆమె ఎన్నోవ్రతాలు చేసింది. తీర్థయాత్రలు చేసింది దానధర్మాలు చేసింది. అయినాసం తానం కలగలేదు. తనకుసంతానంప్రాప్తిలేదనినిశ్చయించుకున్నది.ఒకనాడు భూలోక సంచారానికి వచ్చినపార్వతీ పరమేశ్వరులు వారి ఇంటికి వచ్చి సేదతీర్చుకొను నిమిత్తంగా అఇంటనేఆగిపోయారు. ఆఇల్లాలువారికివినయవిధేయతలతో బంధుమర్యాదలుచేసి భోజనంపెట్టింది. భోజనానంతరం పిచ్చాపాటిమాట్లాడుకుంటూతనకు సంతానంలేదని వివరించింది. అందుకాఆదిదంపతులు అనుగ్రహించి గర్భిణీగౌరీ నోమును ఉపదేశించారు. ఆవ్రతాన్నిచేసి ఆ సంపన్నురాలు సంతానవతి అయ్యింది.

**ఉద్యాపన :-** పసుపు గౌరీని చేసుకుని పూజాపీటంపై ప్రతిష్టించుకుని ఆ గౌరీని ఖర్జూర పళ్ళతో పూజించాలి. పూజించిన ఖర్జూరాలను పిల్లలకు పెట్టాలి. నాలుగు వారాలు పూజచేసి ఉద్యాపన చెప్పుకోవాలి. ఐదుగురు పేరంటాళ్ళకు కొబ్బరిబొండం, దోసిలితో ఖర్జూరాలు వాయనమిచ్చి భోజనం పెట్టాలి.

## 107. ధాన్య దానం నోము కథ

పూర్వకాలంలో ఒకానొక గ్రామంలో సంపన్నురాలైన పడతి ఉండేది. భోగభా గ్యాలకు గాని సిరిసంపదలకు గాని ఆమెకు ఏవిధమైన లోటు ఉండేది కాదు. కాని ఆమెకు ఆజీర్ణవ్యాధిఉండేది. అందువల్ల ఆమె ఏమితిన్నా అరాయించుకోగలిగేదికాదు. కొంతలో కొంత ఇమిడిన ఆహారంలో అంతంతమాత్రంగా జీవిస్తుండేది.

ఒకనాడామె ఇంటికి ఆయవారపు బ్రాహ్మణుడు భిక్షకై వచ్చాడు. అయ్యా తమరు విజ్ఞులు నాకీ దుస్థితి తొలగే తరుణోపాయం చెప్పి నన్ను కాపాడండి. అని వేడుకున్నది. అందుకా విప్రుడు దీర్ఘంగా ఆలోచించి ఇదంతా నీ పూర్వజన్మలో నీవు చేసుకున్న కర్మఫలితం నిన్నీ జన్మలో ఇలా వేధిస్తున్నది. ఇటువంటి దుర్భరపరిస్థితుల నుండి ఉద్ధరించు మహోన్నత మైన వ్రతం ఒకటున్నది. దాన్ని ధాన్యదానం నోము అంటారు. ఎందరో మగువలు ఈ

dotm Mayur Printers - Eldermis VA ID-02696 4/6/2008 Fold : 6 - Front

నోమునునోచుకుని పురాకృతదుష్కర్మల దోషాలనుండి విముక్తి చెంది తరించారు. నువ్వూఈవ్రతం చేసి సుస్థిరత చెంది సుఖించమని వ్రతవిధివిధానాలను వ్రత నియమాలను బోధించాడు.

ఆప్రకారం ఆసంపన్నురాలు ధాన్య దానం నోమునునోచి ఆజీర్ణబాధనుండి విముక్తి పొంది ఇతరబాధలనుండి పూర్వజన్మయొక్క కర్మశేషాలనుండిబయటపడి సంరక్షించబడింది. ఈవ్రతం భక్తి శ్రద్ధలతో చేసిన వారికి ఇహలోక పరలోక సుఖాలు సంప్రాప్తిస్తాయని లోక వాక్కు

**ఉద్యాపన :-** శివాలయానికి వెళ్ళిస్వామిని ఆరాధించి అభిషేకం చెయ్యాలి. ఒక పర్వ దినాన మొదలుపెట్టి సంవత్సరకాలం ఇలా చెయ్యాలి. అనంతరం ఆఖరున ఎద్దు తొక్కని ధాన్యం ఒక గంపలో పోసి వెండినాణేలనుదక్షిణగా అందులో వేసి బ్రాహ్మణోత్తమునకు కొత్త బట్టలతో దానమివ్వాలి.

## 108. పతిజీవనం నోము కథ

పూర్వకాలంలో ఒక గ్రామంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబం ఉండేది. వారికిసంతానం ఎక్కువగా ఉన్నందున వారిని పెంచడం వారికి చాలా కష్టంగా ఉండేది.

ఆ ఊరును పరిపాలించే రాజుగారికి ఒక్కగానొక్క కుమారుడు. అతనికి వివాహంచేసి ముచ్చటపడాలనుకుంటున్న ఆ దంపతుల ఆశ నిరాశయ్యింది. ఆ రాకుమారుడు ఆకస్మికంగా చనిపోయాడు. అతడు బ్రతికి ఉండగా వివాహం చెయ్యలేక పోయారు. అతని శవానికైనా వివాహం చేసి ముచ్చట తీర్చుకోవాలనుకున్నారు. చనిపోయిన తమకుమారుని పెండ్లికి కన్యనిస్తే వేయి బంగారు నాణేలను ఇస్తానని చాటింపు వేయించాడు ఆమహారాజు ఏఒక్కరూ తమ బిడ్డలను ఆ శవానికిచ్చి వివాహం చెయ్యడానికి ముందుకు రాలేదు. కాని అధిక సంతానంతో వారిని పోషించలేక కష్టపడుతున్న నిరుపేద బ్రాహ్మణుడు ముందుకు వచ్చి తన కూతుర్ని ఇవ్వడానికి తనఅంగీకారాన్ని తెలియజేసాడు.

రాజు తన మాట ప్రకారం ఆ కన్యతో చనిపోయిఉన్న తన కుమారునకిచ్చి వివాహం చేసి వేడుకను తీర్చుకున్నాడు. కన్యాదాతకు వేయిబంగారు నాణేలను తన వాగ్దానం ప్రకారం ఇచ్చాడు. అనంతరం తన కుమారుని దహనసంస్కారాలు ఏర్పాటు చేసి ఆనవవధువును చితిపై బలవంతాన కూర్చుండబెట్టారు. చితి రగులుతుండగా మబ్బు క్రమ్ముకుని దారాపాతంగా వర్షంకురిసింది. కమ్ముకున్న చీకట్లకు కురిసిన వర్షానికి మంత్రిపురోహితులు,భటులు, బంధువులు అంతా తలోదిక్కుకూ చల్లాచెదురైపోయారు.

ఆ వర్షపు నీరుకు అరిపోయిన చితిపైన కూర్చుని దిక్కు తోచక నన్నీ దుర్భరజీవితం పాలు చేసావేం భగవంతుడా అని రోధించసాగింది. దివినేలుఅమ్మవారు భువికి దిగివచ్చి ఆమెను ఊరడించి మృత్యుంజయుడైన భీమేశ్వరుడ్ని ఆరాధించే పతి జీవనప్రధాన నోమును ఆచరించు అనిప్రభోదించింది. ఆప్రకారం ఆ అభాగ్యురాలు సదాశివుణ్ణి ఆరాధించి నోమునాచరించింది. రాకుమారుడు ఆ వ్రత ప్రభావం వల్ల సజీవుడై చితి నుండిలేచాడు. ఈ సంగతి తెలిసిన రాజు స్మశానానికి వచ్చి కుమారుడ్ని కోడల్ని తీసుకుని వెళ్ళాడు.

**ఉద్యాపన :-** భక్తితో సాదాశివుడగు భీమేశ్వరుడ్ని ఆరాధించాలి. స్వామికి ఇరుప్రక్కల రెండుదీపాలను పదకొండుపోగులవత్తులతో వెలిగించాలి. ఈప్రకారంచేసి తదనంతరం బ్రాహ్మణ సమారాధన చెయ్యాలి. ఉద్యాపన వాయనం భర్తకే ఇచ్చుకోవచ్చు.



## 109. మార్గశిర మహాలక్ష్మీ నోము కథ

పూర్వకాలంలో ఒకానొక విప్రునకు ఇద్దరు భార్యలు ఉండేవారు ఒకనాడుఅతని రెండో భార్య తన కూతరును అడించమని పెద్దామెబిడ్డకు బెల్లంముక్క పెట్టి అప్పగించింది. పెద్దామెకూతురు తన తమ్ముడి ఆడిస్తూ మట్టితో మహాలక్ష్మీ బొమ్మను చేసి బెల్లం నైవేద్యంగా పెట్టి పిల్లలతో కూడి ఆడుకుంటున్నది. ఆది చూచిన పెద్దామె చిన్నామెపై విసుగుకుని చేరిన పిల్లలందర్ని తరిమి కొట్టి ఆమట్టి బొమ్మను చెదరగొట్టి చిందరవందర చేసింది.

కొంతకాలానికి పెద్దామె బిడ్డకువివాహం జరిగింది. పూజాసంకల్పం, భక్తిగల ఆమెఅత్త వారింటఅష్టైశ్వర్యాలతోతులతూగుతుండెది. తన పుట్టింటివారు దీనాతిదీనంగా దారిద్ర్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని తన సవతి తమ్ముడ్ని పిలిచి బంగారం నాణేలిచ్చి పంపించింది. త్రోవలో దొంగలుదోచుకున్నారు. ఇలారెండుమూడుసార్లుదొంగలు దోచుకుపోవడంతో ఆమెతనతల్లితండ్రులను తనఇంటికి పిలిపించి వారి చేత మార్గశిర మహాలక్ష్మీనోము నోయించింది. తనతల్లి మహాలక్ష్మీకిచేసిన అపరాధమునకు క్షమాపన చెప్పించింది. ప్రతి యేటావాళ్ళు నోమునోచుకునేలా చేసింది. ఈమెభక్తి శ్రద్ధలకు మహాలక్ష్మీ ప్రసన్నురాలై వారినిఅనుగ్రహించింది. వారికికూడాకష్టాలుతొలగిసిరి సంపదలు సుఖసౌఖ్యాలు కలిగాయి.

**ఉద్యాపన :-** ఈవ్రతాన్ని మార్గశిర మాసంలో చెయ్యాలి. లక్ష్మీవారం శుభప్రదం తాను ఉపవాసముండి షోడశోపచారాలతో నాలుగు వారాలు అమ్మవారిని పూజించాలి. అమ్మవారిపూజాక్షింతలను శిరస్సున చల్లుకోవాలి. పేరంటాళ్ళనుపిలిచి భోజనంపెట్టాలి. మొదటి వారంపులగం రెండవవారంపరమాన్నంమూడోవవారం కుడుములు నాల్గోవవారం పళ్ళు ఫలాలు అమ్మవారికి నివేధించి పేరంటాళ్ళకలో నలుగురికి క్షీరాన్నాం పెట్టాలి.

## 110. నాగపంచమి నోము కథ

పూర్వకాలంలోఒకానొక గ్రామంలో ఒక శ్రీమంతురాలుండేది. ధనగర్వంగాని అహకారంగాని లేని సుగుణవతి, విధ్యావినయంగల సౌజన్యురాలు. పెద్దలపట్ల వినయవిధేయతలతోను నౌకర్లుపట్ల కరుణ, దయ, సానుభూతిగల సద్గుణసంప న్నురాలు. ఈ సుగుణవతికి ఒక తీరని బాధ ఉండేది. చెవిలో చీము కారుతుండేది. రాత్రులందు సర్పం కలలో కనబడికాటు వేయుబోతుండేది. ఇందువల్ల ఆమె మనస్సులో ఎంతో కలవరపడుతుండేది. ఎన్ని పూజలు చేయించినా ఎన్ని శాంతులు చేయించినా కలలో పాములు కనబడడం కాటు వేయు బయపెట్టడం తగ్గలేదు.

ఇందుపై ఆమెతనకు కనబడినవారందరికి తన బాధలు చెప్పుకుని తరుణోపాయం చెప్పమని వేడుకునేది. ఒకనాడు ఒక సన్యాసి వాళ్ళ ఊరుకు వచ్చాడు. ఆ సాధువు త్రికాలజ్ఞానుడని విని అతనివద్దకు వెళ్ళిన తన ఇంటికి పాదపూజకు ఆహ్వానించింది. అతిథి మర్యాదలు పాదపూజలు సమారాధన గడిచాక ఆమెతన బాధలను చెప్పి ఇందుకు గల కారణమేమై ఉంటుందని, ఇవి తొలిగే మార్గమేమిటని వినయపూర్వకంగా వేడుకున్నది.

అందుకా సాధుపుంగవుడు తీవ్రంగా ఆలోచించి ఇది నీకు సర్పదోషంవల్ల సంభవించింది. ఏమి చేసినా నాగేంద్రుని అనుగ్రహం నీకు సిద్దించలేదంటే, దానికి గల కారణం

dotm Mayur Printers - Eldermis VA ID-02696 4/6/2008 Fold : 6 - Front

నీవ్యాధి, భయాందోళనలు తొలగాలన్నదే నీ లక్ష్యంగాని సుస్థిర భక్తితో ఆరాధించి శ్రద్ధను చూపనందువల్ల నీకీ దుస్థితి నిన్నింకావేదిస్తూనే ఉన్నది. నీవు గత జన్మలో నాగపూజచేసే వారిని అక్షేపణచేయడం నీవు పూజలు చేయకపోగా చేసేవారిని చెడగొట్టడం, చులకన చేయడం నీవు చేసిన మహాపరాధం. నాగేంద్రుడు దయామ యుడు, తనను నమ్మినవారిని సముద్ధరించే కరుణాసముద్రుడు కనుక నీ వీవిషయం పట్ల విశ్వాసముంచి నాగపంచమి నోమునోయికలతలుతొలగుతాయి. చెవి చక్కబడు తుందనిచెప్పి ఆవ్రతవిధివిధాననియ మాలను గురించివివరించివెళ్ళిపోయాడు ఆసాధువు ఉపదేశించిన వ్రతవిధాన క్రమమును ఎంతో భక్తిశ్రద్ధలతో నాగపంచమి నోము నోచి ఆవ్రతప్రభావం వల్ల తన భయాందోళనల నుండి బాధలనుండి విముక్తిని పొందింది.

**ఉద్యాపన :-** శ్రావణమాసంలో శుక్లపంచమినాడు చేయవలసిన నోము ఇది అభ్యంగన స్నానం చేసి మడిగా శుచిగా ఏకాగ్రచిత్తంతో ఉండి నాగేంద్రుడ్ని ఆరాధించాలి. నాగేంద్రుని వెండి విగ్రహంచేయించి పాలు,పానకం,వడపప్పునివేదించి తాంబూలఫలపుష్పాలు నారి కేళం సమర్పించాలి. నాడు ఉపవాసం ఉండాలి. నిలాహారం జాగరణమరింత శ్రేయస్కరం.

## 111. కేదారేశ్వర (కార్తీక) నోము కథ

పూర్వకాలంలో ఒకానొక గ్రామంలో ఒక నిరుపేద కుటుంబం ఉండేది. ఆ పేద దంపతులుకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు కుటుంబం జరుగు బాటు చాలా దుర్భరంగా ఉన్నందువల్ల పెద్దవాళ్ళయిన కుమార్తెలిద్దరూ అడవికి వెళ్ళి కట్టెలు యేరుకుని వచ్చి వాటిని గ్రామంలోఅమ్మి కుటుంబ పోషణ కొనసాగిస్తుండేవారు. ఇలా కాలం గడుస్తుండగా ఒకనాడు వాళ్ళు పుల్లలు ఏరుకుని గ్రామానికి వస్తుండగా పొలిమేరలోని ఒకఇంట యేదో పూజ చేసుకుంటుండడంచూచి ప్రసాదం తెచ్చుకోవాలని అక్కడకు వెళ్ళారు. పూజాక్రమంచూసిముచ్చటపడి అమ్మాయిలు ఈ పూజను గురించి చేసే విధానాన్నిగురించిఇంటియజమానురాలిని అడిగి తెలుసుకున్నారు. ప్రసాదం తీసుకుని ఇంటికి వెడుతున్న వాళ్ళకు ఆపూజ తాముకూడా చేసుకోవాలన్న ఆశ కలిగింది. ఒక చెట్టు మొదట తమ గంపలు దింపి అక్కడ శుభ్రంచేసి మర్రి ఆకులు పళ్ళు ఊడలు, పత్రి ప్రోగుచేసుకునివచ్చి నవ్వే మాదేవుడవని అక్కడగల ఒక రాతిని ఆచెట్టు మొదలులో పెట్టి పూజ చేసి స్వామి ఇవే తమలపాకులు ఆకులు చెక్కలనుకో అని మర్రి ఆకులు, పళ్ళు పెట్టారు. ఇవే బూరెలనుకో అని మర్రిపళ్ళను నైవేద్యంగా పెట్టారు. ఇవే తోరాలనుకో అని మర్రి ఊడలు స్వామి ముందు పెట్టి భక్తితో పూజ పూర్తిచేసారుఅక్కాచెల్లెళ్ళు, ఇంటికి బయలు దేరుతూ వాళ్ళు తమతమ గంపలను నెత్తినకెత్తుకోబోగా వాటిల్లోని పుడకలన్నీ బంగారపు పుడకలుగామారి ఉన్నాయి. వారు అత్యంత ఆనందంతో ఇంటికి వెళ్ళి తల్లితండ్రులకు జరిగిన సంగతంతా చెప్పి ఆ పుడకలను అమ్ముకుని శ్రీమంతులయ్యారు.

సిరిసంపదలుపెరిగిన ఆసుందరాంగుల్ని తూర్పునుండి ఒకమహారాజువచ్చి పెద్దా మెను, పడమరనుండి ఒకమహారాజు వచ్చి చిన్నామెను పరిణయం చేసుకుని తమ తమ రాజ్యాలకు తీసుకువెళ్ళిపోయారు. వాళ్ళు వెడుతూవెడుతూశ్రద్ధాభక్తులతో ప్రతిఏటా కార్తీక మాసంలో ఈ నోమును నోచుకుంటుండలసిందనిచెప్పారు. ఆప్రకారంగా చేస్తు వాళ్ళు



కాలం గడుపుతున్నారు. కుమారుడు పెరిగి పెద్దవాడయ్యాడు. కార్తీక నోమును భారీగా చెయ్యాలని సంకల్పించుకున్నాడు. పాతతోరాలు తీసిపెరటిలో కాకరపాదుమీదపడవేశాడు. బంగారపుతోరాలుచేయించాడు. నవగాయ పిండివంటలతో గారెలు, బూరెలు క్షీరాన్నం తో భోజనాలు పెట్టాడు. గ్రామస్తులంతా అతనిని ఎంతగానో ప్రశంసించారు. కానీ కేదారేశ్వరుని కరుణ మందగించింది. ఏటికేడాది వారి సిరిసంపదలు తొలగి పేదరికం దాపురించింది.తినడానికి తిండిలేని దుస్థితి కలిగింది. ఏపని చెయ్యాలనుకున్నా జరగక పోగా కష్టాలుకలుగుతుండేవి. ఆఇల్లాలు తమపెరటిలో విరగకాసిన కాకరపాదును చూసి కొన్ని కాయలు కోసి కొడుకుకిచ్చి అంగడికి వెళ్ళి చారెడు నూకలు పప్పు ఉప్పు తీసుకురమ్మని పంపించింది. అవితీసుకు వెళ్ళి అతడు షావుకారు అంగడి ముందు నుంచున్నాడు. ఎంతసేపటికి ఆ షావుకారు చూడలేదు. తరువాత చూసి ఏమిటి తీసుకొచ్చావని ప్రశ్నించాడు. అయ్యా ఈ కాకరకాయలు తీసుకుని చారెడు బియ్యం ఇప్పించండి మీపేరు చెప్పుకుని ఈ పూట కింత గంజితాగుతాం అన్నాడు. అలానా మీకూ మీకూ దారపోయ డానికి మాకేం మధ్యంతరపు సిరి కలగలేదు. వెళ్ళు వెళ్ళు అని గసురుకున్నాడు. కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమలాడాడు వదిలేలాలేదని దోసెడు బియ్యం పప్పు ఉప్పు ఇచ్చి పంపించాడు. ఆపూటకు వాళ్ళు ఆకలి తీర్చుకుని మర్నాడు మరికొన్ని కాయలు కోసి మరో అంగడికి వెళ్ళి అమ్ముకుని రమ్మని పంపించింది.

వాటిని పట్టుకుని అంగడి వీధికి వెడుత్ను బాలుడ్ని ఆషాపుకారు ఆపి ఏమి కావాలంటే అవి ఇస్తాను రోజూ ఆ కాయలు నాకే ఇవ్వవలసిందని చెప్పి భారీగా వెచ్చాలు బియ్యం ఇచ్చాడు. ఆషాహుకారుఎందువల్ల అతనికింత దయకలిగిందంటే ముందు రోజున తను తీసుకున్న కాకరకాయలు కూర చేసే నిమిత్తంగా కోస్తే వాటిల్లో నుండి బంగారం ముద్దలుగా రాలిపడ్డాయి. ఇవి ఇంకెవరికి దక్కకూడదని ఆ షాహుకారు ఎంతఇవ్వడానికైనాసిద్ధపడ్డాడు. రోజూ కుర్రవాడు నుండికాకరకాయలు కొంటుండేవాడు. కాకరకాయలైపోయాయి ఆ షాహుకారు చిల్లిగవ్వకూడా ఇవ్వడం మానేసాడు.

ఇక గత్యంతరం లేక తల్లి తన కుమారుడ్ని ప్రయాణం చేసితూర్పునగల పెద్దఅక్క దగ్గరకు పంపించింది.కష్టసుఖాలు చెప్పి ఏమైనా సహాయాన్ని అడగమన్నది. అతడు అక్కగారి ఇంటికి చేరుకునినౌకర్లు లోపలకు వెళ్ళనివ్వకపోతే అక్కడే ఉండగా తల ఆరబోసు కోడానికి మేడ మీదకు వచ్చిన అక్కగారు తమ్ముడిని చూసి లోపలకు తీసుకువెళ్ళింది. అక్కగారికి ఇంటిపరిస్థితులన్నీ చెప్పాడు. ఒకగుమ్మడికాయను దొలిపించిఅందులో వరహాలు పోసి తమ్ముడికిచ్చి తిన్నగా వెళ్ళి దానిని అమ్మకు ఇవ్వవలసిందని చెప్పి పంపించింది. తిరిగివస్తూ అక్కగారిచ్చిన చద్ది తినాలని ఆ గుమ్మడికాయను నేలమీద ఉంచి చద్ది తింటు న్నాడు. అంతలో ఒకపెద్ద గ్రద్దవచ్చి దానినితన్నుకుపోయింది. చేసేదేమి లేక ఉత్త చేతులతో ఇంటికి వెళ్ళలేక పడమట ఉన్న చిన్న అక్కగారి వద్దకు వెళ్ళాడు. నౌకర్లువల్ల అతని రాక విన్న ఆమెబయటకొచ్చి తమ్ముడ్నిలోపలకుతీసుకువెళ్ళింది కష్టసుఖాలను అడిగితెలుసు కున్నది. ఒకచెప్పుల జతలోవరహాలు పెట్టికుట్టించి దానినిఎక్కడా విడవకు తిన్నగా ఇం[illegible] వెళ్ళు అని చెప్పి పంపించింది. ఆ అక్క ఏమి ఇవ్వలేదు. ఈ అక్కా ఏమి ఇవ[illegible] బాధపడుతూ ఇంటికి బయలుదేరాడు. ఎండతీవ్రతకు దాహంవేసి ముఖం

dotm Mayur Printers - Eldermis VA ID-02696 4/6/2008 Fold : 6 - Front

కాసిని మంచినీళ్ళు త్రాగాలనినిర్ణయించుకుని అక్కగారు ఆజోళ్ళు ఎక్కడా విడవవద్దుఅని చెప్పడంవల్లచెప్పులతోనే చెరువులోదిగాడుకానిఆబురదలో కూరుకుపోయి ఎంత వెదికినా దొరక లేదు.

ఈసంగతంతా చెప్పి పెద్ద అక్కగారిని సాయం అడగాలని తిరిగి అమెవద్దకు వెళ్ళాడు. అది కార్తీక మాసం ఆమె కార్తీక నోము నోచుకుంటున్నది. ఆడంబరంగా నోము నోయడం వల్లనే తన పుట్టింటిన దారిద్ర్యము తాండవిస్తుందని గ్రహించి తమ్ముడిచేత ఆ నోము నోయించి ఆడంబరంకాదునాయనా ముఖ్యం గతంలో ఏవిధంగాచేసుకుంటున్నామో ఆ విధంగా ఈ నోము చేసుకోవడంముఖ్యం అనిచెప్పి ఇంటికివెళ్ళి కేదారనోమును నోయండని చెప్పి కొంత డబ్బిచ్చి పంపించింది.

అతడు ఇంటికి వస్తుండగా గుమ్మడి పండు తనులోగడ విడిచినచోట కనిపించింది. చెరువుఎండి చెప్పులుపైకివచ్చాయి. వాటిని తీసుకుని ఇంటికి వచ్చి విషయాలన్ని వివరించి కేదార నోమును భక్తిప్రపత్తులతో జరిపించాడు. క్రమక్రమంగా సిరులు పుంజుకుని తిరిగి మొదటి వైభవంతో జీవించారు.

**ఉద్యాపన :-** ఇది కార్తీక మాసములో సోమవారాలు ముఖ్యంగా మూడవసోమవారం కార్తీకపౌర్ణమి ఏరోజు కుటుంబ సాంప్రదాయమైతే అరోజున చేయాలి. ఉదయం నుండి ఉపవాసముండి సాయంత్రం పరమేశ్వరుణ్ణి ఫల,పుష్ప, పత్రితో పూజించాలి. పాత తోరాలు కొత్తవాటితో పాటు స్వామి సన్నిధానానపెట్టాలి. స్వామికి బూరెలు నైవేద్యం పెట్టాలి. ఈ బూరెలను నోము నోచుకున్న కుటుంబీకులు మాత్రమే తినాలి. పున్నమి చంద్రుడ్ని చూచి ఆహారం తీసుకోవాలి. తోరాలు చేతికి కట్టుకుని కాసేపు ఉంచుకుని తీసి వాటిని మురుసటి సంవత్సరానికి భద్రపర్చాలి. ఈ నోమును కోడళ్ళకు కొడుకులకు ఉద్యాపనచెప్పి అప్పగించి వంశపారపర్యంగా చేసుకుంటుండం కుటుంబ సాంప్రదాయం.

## 112. దంపతులు తాంబూల నోము కథ

పూర్వం గంగానదీతీరాన విప్రవటిఅనబడే బ్రాహ్మణఅగ్రహారంఉండేది. ఆగ్రామంలోని బ్రాహ్మణ కుటుంబాలలో గోపాల శర్మ అనబడే విప్రోత్తముని కుటుంబం పెద్దకుటుంబం ఆయనకు ముగ్గురుకుమారులు పెద్దవారిద్దరికి వివాహాలుఅయిచక్కగాజీవిస్తున్నారు. మూడవ వానికి కూడావివాహంచేసాడు గోపాలశర్మ అదేమి ప్రారబ్ధమోగాని ఆ కోడలుకాపురానికి వచ్చిన నాటినుండి అందరితోనూ ఎందుకోఒకందుకూ గొడవలు జరుగుచుండేవి. అయిన వారు కానివారు ఆమెమీద నిందలు మోపి అనరానిమాటలతోదుర్భాషలాడుతుండేవారు. వారందరితో ఎంత మంచిగా మసలు కోవాలన్నా ఆమెకు సాధ్యమయ్యేదికాదు.

కాలంగడచిపోతున్నదేగాని పరిస్థితులలో మార్పురాకపోగ నిందలు నిష్ఠూరాలు ఎక్కువై పోయాయి. అందుకు తనవల్ల దోషమేమిటో తెలియని ఆ చిన్న కోడలు వారందరి మధ్య మసులుకోలేక ఒకనాటి రాత్రి ఊరు పోలిమేరలోని శివాలయానికి వెళ్ళి గోడుగోడున విలపించసాగింది. తనతప్పేమిటి ఈముప్పుతీరాలంటే ఏమిచెయ్యాలి చావేనాకు శరణ్యమా! అని అమాయకంగా ప్రశ్నించింది.



ఆమె ఆవేదనకు జాలిపడ్డ పరమేశ్వరుడామెకు సాక్షాత్కరించి బిడ్డా నీ వలన దోషమేమి లేదు. నీవెంత సౌమ్యంగా వినయవిధేయతలతో మసలుకోవాలన్నా చులకనగా హేళనగా నీజీవితంసాగుతున్నది. ఇందుకు గలకారణం గతజన్మలో దంపతులతాంబూ లాలనోము నోచి మధ్యలో ఆపివేశావు. ఆకారణం వల్లనే స్త్రీలకు పురుషులకు నీ పట్ల ద్వేషాభావం కలుగుతున్నది. ఇదితొలగాలంటే నీవునీఇంటకిపోయిదంపతుల తాంబూలాలనోము నోచుకోఈ నోముకారణంగా నీచుట్టూగలఇరుగుపొరుగువారునీఇంటివారు మొట్టినింటి వారునీమీద ప్రేమానురాగాలు కలిగి నిన్ను ఆదరిస్తారు. అని ప్రభోదించాడు.

ఆమె ఆ ప్రకారం ఇంటికి వెళ్ళి దంపతుల తాంబూలం నోము నోచుకుని అయిన వారందరిలో గౌరవమర్యాదలు మన్ననలతో హాయిగా జీవించింది.

**ఉద్యాపన :-** పార్వతీ పరమేశ్వరులకుపీటం ఏర్పాటుచేసుకునిశతనామావళితో ఆ ఆదిదంపతులను ఆరాదించాలి. గుణవంతులైన దంపతులను ఆహ్వానించి వాళ్ళకు తలంటి నీళ్ళుపోసి నూతన వస్త్రాలు కట్టబెట్టి పంచభక్ష్యపరమాన్నాలతో భోజనాలు ఆరగింపజేసి దక్షిణ తాంబూలాలతోగౌరవించి వారికి పాదాభివందనంచేసివాళ్ళఆశీస్సులు పొందాలి. ఇలా పదిహేను వారాలు చేసి ఆఖరున అన్నసంతర్పనచేయాలి. ఇలాచేయడంవల్ల సాటి వారిలోతోటివారిలో మేటిగాగుర్తింపబడి గౌరవమర్యాదలుగల జీవితాన్ని గడపగలుగుతారు.

## 113. శివరాత్రి నోము కథ

పూర్వకాలంలో ఒకానొక దేశంలో ఒక బ్రాహ్మణ పండితుడుండేవాడు. అతడెంతటి విధ్యాసంపన్నుడో అంతటి దారిద్ర్యము అతడ్ని వేదిస్తుండేది. ఎంత ప్రయత్నించినా చేతికి చిల్లి గవ్వైనా లభించేదికాదు. ఇందుకు జతగా అతడి అరోగ్యంకూడా అంతంతమాత్రంగా ఉండేది. ఈ దుర్భర పరిస్థితులతో మరొకర్ని యాతన పెట్టడం దేనికనివివాహం చేసు కోలేదు. నా అన్నవారెవరూలేక సేవలు చేసే ఇల్లాలు లేక అతడు ఎంతగానో బాధపడు తుండేవాడు. క్రమక్రమంగా అతడికి జీవితం మీద విరక్తికలిగింది. ప్రాణాలు తీసుకోవడం శాస్త్రసమ్మతంకాదని నారుపోసిన వాడు నీరపొయ్యకపోతాడా అని కాలాన్ని గడుపుతుండే వాడు. క్రమక్రమంగా ఓర్పునశించింది. ఇంక ప్రాణత్యాగం ఒక్కటే తనకు తప్పని సరిమార్గ మని నిర్ణయించుకున్నాడు. నీటిలో పడాలి. అగ్నికి ఆహుతి కావాలి, కత్తి కటార్లుతో పొడుచుకోవాలి, విషాన్ని తినాలి అని పలు విధాలుగా ఆలోచిస్తూ క్రమంగా నిద్రలోకి ఒదిగిపోయాడు. నిద్రలో వానికి పరమేశ్వరి సాక్షాత్కరించి ఓయీ ! ప్రాణం తీసుకోవాలని దేనికి ప్రాకులాడెదవు. సాదా శివుడు కన్నా దయామయుడు లేదు ఆ శంకరుని కరుణా కటాక్షములను పొంది తరించు అని చెప్పింది. మేల్కొన్న విప్రుడు ఒక పండితోత్తముని వద్దకువెళ్ళి తనబాధలను తనకు వచ్చిన కలను చెప్పి శివకరుణ కొరకు తానేమి చెయ్యాలిని ప్రశ్నించాడు. విప్రోత్తమా పార్వతి పరమేశ్వరులు జననీజనకులు కదా జగదాంబనిన్ను కరుణించి ఈశ్వర కటాక్షం పొందమని ప్రభోదించింది. ధన్యుడవు శివునకు ప్రీతియైన రోజు శివరాత్రి ప్రతిమాసంలో ఆఖరి మూడవరోజు శివరాత్రి ఔతుంది. ఆనాడు నీవు నదీస్నానంచేసి ఉపవాసముండి ఆరాత్రంతాశివనామార్చనతో జాగారంతోగడిపి ప్రత్యూష కాలంలో శివలింగాన్ని పూజించి ఇలా మహాశివరాత్రివరకు గడుపు ఆనాడు కలిగిన

dotm Mayur Printers - Eldermis VA ID-02696 4/6/2008 Fold : 6 - Front

మేరకు ఎవరికైనా ఒకరికిఒకఫలమో తృణమో ఇచ్చినమస్కరించి వారి ఆశీస్సులు పొందు నీ బాధలు తీరుతాయి. దారిద్ర్యముతొలగిపోతుంది. ఆరోగ్య వంతుడవు అవుతావు అని చెప్పగా ఆ ప్రకారంగా భక్తి శ్రద్ధలతో శివరాత్రి నోము నోచుకుని అతడు జీవితాంత సుఖ శాంతులను అనుభవించాడు.

**ఉద్యాపన :-** ప్రతి మాసశివరాత్రి నాడు శివలింగార్చనతో నిలాహారము జాగారం చేయాలి. ఇలాసంవత్సరకాలం ప్రతీమాసశివరాత్రినాడుచేసి ఆమర్నాడు ఒక నిరుపేదకు కలిగినమేరకు అన్నదానంచెయ్యాలి. మహాశివరాత్రిపర్వదినాన క్షనమైనవ్యర్థం చేయ కుండా శివాక్షరిని జపించాలి. శివునకు అర్చన చేయాలి. ఆనాడు శక్తి కలిగిన మేరకు అన్నదానం ఆర్థిక సహాయము నిరుపేదలకు అందించి వారి ఆశీస్సులు పొందాలి.

## 114. తులసి నోము కథ

పూర్వకాలంలో భారత దేశమున గల వింధ్యపర్వతాలకు దిగువ కాంచనపురం అనే దేశం ఉండేది. దానిని ధర్మశీలుడనునే రాజు పరిపాలిస్తుండేవాడు. ఆయనకు లేక లేక ఒక్కగానొక్కకూతురు. ఆమెకు వివాహం జరిగితే నెలతిరక్కుండా వైధవ్యం కలుగు తుందని ఆమెజాతకాన్నిపరిశీలించినదైవజ్ఞులు చెప్పారు. అందువల్ల ధర్మశీలుడు తన కుమార్తెకు వివాహం చేసే ప్రయత్నం విరమించుకున్నాడు. ఇలా కాలం గడుస్తుండగా రాజుగారి ఆస్థాన విద్వాంసుడైన మహీశ్వర భట్టునకు తండ్రికి తగ్గ తనయుడు అనదగిన కుమారుడుండేవాడు. అతడు రాజకుమార్తె అందచందాలు గుణ గుణాలు విని ఆమెను వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

ఒకానొక శుభదిననా బ్రాహ్మణ యువకుడు రాజ దర్శనం చేసుకున్నాడు. మహారాజు ఆయువకుడికి తగినమర్యాదలుచేసి తనదర్శనానికివచ్చిన కారణం యేమిటని ప్రశ్నించాడు. మహారాజా ! మీరు అనుగ్రహిస్తానంటే నాదొక కోరిక సమస్త శాస్త్రాలు చదువుకున్నవాణ్ణి విద్యలందన్నిటా అరితేరినవాణ్ని మీరు ఔనంటే మీకుమార్తెను వివాహం చేసుకోవాలని మీ అనుమతికై వచ్చాను అన్నాడు. ఆ మాటలకు మహారాజు ముఖం వెలవెల బోయింది. విప్రకుమారా ! ఆమెకు వైధవ్యం ఉన్నందువల్లనే తెలిసితెలిసి ఒకయువకుడ్ని అర్ధాయుష్కుడ్ని చేసే కన్యాదానానికి వెరచి ఊరుకున్నాను నీవు వివాహం చేసుకుంటానంటున్నావు. నాకుమార్తెకు నీకన్నా రూప గుణ సంపన్నుడు దొరకడం దుర్లభం కాని నిన్ను అర్ధాయుష్కుడ్ని చేసి బ్రాహ్మణహత్యాదోషాన్ని పొందలేను నన్ను మన్నించు అన్నాడు.

అందుకా బ్రాహ్మణబాలుడు మహారాజా మీకాభయం సందేహం అక్కర్లేదు. నేను పూర్ణాయుష్కుడనని జ్యోతిష్యశాస్త్రజ్ఞులు ఎంతోమంది చెప్పియున్నారు. అయినా ఇందుకు నాకు తెలిసిన మేరకు ఒక ఉపాయం చెబుతాను. ఒక నెలరోజులపాటు నన్ను అనుమ తించండి హిమాలయపర్వతాలలో ఋషులు దర్శనం చేసుకుని వారి ఆశీస్సులు పొంది వస్తాను. ఈలోగా మీ అమ్మాయిచేత తులసి నోము నోచుకునేలా తగిన ఏర్పాట్లు చేయండి. అక్షయసౌభాగ్యాలను అనుగ్రహించే చల్లని తల్లి శ్రీతులసి స్త్రీలపాలిట కల్పవల్లి అందువల్ల మీ అమ్మాయికి సుమంగళి జీవితం లభిస్తుంది. పూర్వందేవతలుతమకు కలుగుతున్న అపజయాలనివారణకుశ్రీతులసిని ఆరాధించారు. ఆమాటలకు ఆరాజుముగ్ధుడై బ్రాహ్మణ



కుమారా నీమాటలు నామదికెక్కాయి. నా కుమార్తెచేత తులసివ్రతం చేయిస్తాను నువ్వు ఋషిపుంగవుల దీవెనలనుపొంది సంవత్సరాంతమునాటికి రావలసిందన్నాడు. అంతట బ్రాహ్మణ యువకుడుతులసి వ్రతవిధి విధానములను వ్రత నియమనిష్టలను వివరించి వెళ్ళిపోయాడు. రాకుమార్తె తులసి వ్రతం సమాప్తికావడంతో బ్రాహ్మణ యువకుడు రాజ్యానికి వచ్చి ఆమెతో వివాహితుడై కాంచనపురాన్ని చిరకాలం పరిపాలించాడు.

**ఉద్యాపన :-** కార్తీకమాసం ఈ వ్రతానికి తగిన కాలం శ్రీమన్నారాయణుని విగ్రహాన్ని తులసిమొక్క వద్దఉంచి కార్తీక శుద్ధ ద్వాదశి నాడు పంచామృతస్నానం చేయించి ఆవాహనం చేయాలి. ముత్తైదువులకు యధోచితంగా పసుపు కుంకుమ గాజులు దానమివ్వాలి. ఫల పుష్ప తాంబూలాలతో వారిని సత్కరించాలి.

## 115. రథసప్తమి నోము కథ

పూర్వకాలంలో ఒకానొక మహారాజుకు లేక లేక ఒక కూతురు జన్మించింది. ఆమెను అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నాడు. కాని ఆమె పుట్టుక కారణంగా రాజ్యంలో కొన్ని కలతలు ఏర్పడుతుండేవి. మహారాజు ఏపని తలపెట్టినా జరిగేదికాదు. ఇందుకు విజ్ఞులను పిలిపించిశాంతిచేయించాలని నిర్ణయించుకున్నాడు. రాజ్యంలోగల ప్రజ్ఞావంతు లైన విప్రులందర్నీ రప్పించాడు. అన్ని విషయాలు వివరించాడు. ఈ దుస్థితి తొలగే మార్గంఏదైనా చెప్పమనిఅడిగాడు. విజ్ఞులైన ఆ విప్రోత్తములందరూ ఒకటై ఆలోచించారు.

రాజా ఈమె గత జన్మలో వితంతువు అంతకు ముందు జన్మలో రథకారుని భార్య రథకారుడు చేసే ప్రతీపనిని విమర్శించి అతని పనులకు అడ్డుతగులుతుండేది. అందువల్ల పై జన్మలో విధవరాలైయింది. తన కుటుంబ పోషణభారం ఆమెదేకావడం వల్ల తప్పనిసరై వ్యభిచారం చేసి సంసారాన్ని సాగించింది. వ్యభిచారం కారణంగా అనేక దుష్కృత్యాలపాలం య్యింది. ఆమెచే రథసప్తమి నోము నోయిస్తే తమకు ఈ గండాలుండవు ఆమెకు గల గతజన్మపాతకాన్నీ రూపుమాసిపోతాయి అని చెప్పారు.

వేద జ్ఞానసంపన్నులు భూతభవిష్యత్ వర్తమానాలు తెలిసిన విజ్ఞానవేత్తలు నాకు నా రాజ్యానికి గల సిరిసంపదలు మీరే. కనుక నాయందు నాపుత్రిక యందు పరిపూర్ణ ప్రేమాభిమానాలు కలగజేసి నన్ను నా రాజ్యాన్ని కాపాడేటందుకు మీరందరూ రథసప్తమి నోమును నాకుమార్తెచేతనోయించండి వ్యయభారాలకు వెరవకండి అన్నాడు. రాజు. అందుకు వారందరూ ప్రభువు ఆజ్ఞప్రకారం రాజకుమార్తె చేతరథసప్తమి నోము నోయిం చారు. అరిష్టాలన్నీ తొలగిపోయాయి. సుఖశాంతులతోజీవితాన్ని గడిపారు.

**ఉద్యాపన :-** సూర్యభగవానుడు మన కర్మలకు సాక్షి ప్రతిరోజు సూర్యోదయ కాలంలో ఆ మహనీయునకు నమస్కరించుకుని మనం మన నిత్య కార్యక్రమాలకు పూనుకోవాలి.

పుష్యబహుళ దశమి నుండి మాఘ శుక్ల సప్తమి వరకు నిత్యం పరమాన్నాం నివేదించాలి. రథసప్తమి రోజున సూర్యభగవానుని పూజించాలి. మొక్క పెసలను నివేదనగా అయన దిక్కుగా విసరాలి. పువ్వులతో పూజించాలి. ముత్తైదువునకు ఆనాడు భోజనం పెట్టి ఫల, పుష్ప, తాంబూలాలతో సత్కరించాలి.

dotm Mayur Printers - Eldermis VA ID-02696 4/6/2008 Fold : 6 - Front

## 116. నూటొక్క నిమ్మపండ్ల నోము కథ

పూర్వం కుశస్థలీపురంలోని అగ్రహారంలో గల బ్రహ్మణ కుటుంబంలోని ఇద్దరుతోటి కోడళ్ళు చాలా అన్యోనంగా ఉండేవారు. ఏపని చేసినా ఇద్దరూ కూడబలుక్కుని చేస్తుండే వారు. వారికి ఆయవారానికి వచ్చిన ఒక సాధువు నిమ్మపండ్ల నోమును ఉపదేశించాడు. ఆ సాధువుంగవుని మాటవిని ఆ తోటి కోడళ్ళిద్దరూ నొటొక్క నిమ్మపళ్ళ వ్రతం నోచు కున్నారు. శ్రద్ధాభక్తులతో నోము నోచుకోవడంవల్ల చిన్నామెకు సిరిసంపదలు కలిగిహాయిగా జీవిస్తున్నాది. పెద్దామె జీవితంలో ఏవిధమైన మార్పురాలేదు సరిగదా పేదరికంతో రాను రాను జీవనం దుర్భరంగా అయిపోసాగింది.

ఒకనాడు తోటికోడలు ఇంటికి అప్పు అడగడానికి వచ్చింది సుమతి. కాలం గడవడం కష్టంగా ఉంది. మీ బావగారు ఎంతశ్రమపడినా కూటికిసరిపడు సొమ్ములభించడంలేదు సాధువు మాటప్రకారం నూటొక్క నిమ్మపళ్లు నోము ఇద్దరం కలిసే నోచుకున్నాంగదా మా పరిస్థితి ఎందువల్ల ఇలా దుర్భరమైపోయిందని విచారించసాగింది. అక్కా! విచారిం చకు ఇద్దరం కలిసే నోము నోచుకున్నాం బహుశా నువ్వు నిమ్మపళ్ళు బాగోగులు పరిశీలిం చక మంచివి, పుచ్చువి, మచ్చలున్నవి పేరంటాళ్ళకు వాయనమిచ్చి ఉంటావు. అందువల్ల వ్రత నియమాలనుదాని విధివిధానాలను ఉల్లంఘించిన దానివై ఇలా వెతలపాలౌతున్నావు. యిప్పటికైనా మించి పోయిందేమీ లేదు. ఈ సారి మంచి పళ్ళను ఎంచి సమకూర్చుకుని నోము నొయ్యివలసిందని చెప్పింది.

ఆమె మాటలు మదికెక్కిన పెద్దామె భక్తిశ్రద్దలతో మంచి నిమ్మపళ్ళతో నోము నోచు కున్నది. ఆనాటినుండి ఆమెకు కుటుంబ పరిస్థితి క్రమక్రమంగా మెరుగుపడి సిరి సంపద లతో వర్ధిల్లిందా తోటికోడలు.

**ఉద్యాపన :-**మంచి నిమ్మపళ్ళు 101 సమకూర్చుకోవాలి. వాటిని పేరంటాళ్ళకు ఆకు వక్క దక్షిణ, పసుపు కుంకుమలతో ఇచ్చి వాళ్ళ ఆశీస్సులు పొందాలి.

## 117. గరుడ పంచమి నోము కథ

కశ్యపమహర్షి భార్యలలో సుపర్ణి సవతితోకలిగిన వాదప్రతివాదాలలో ఓడిపోయి ఒప్పదం మేరకు ఆమెకు దాస్యం చేస్తుండేది. ఆమెకు కలిగిన పక్షిసంతానంలో గరుడు అది చూచిసంహించలేకపోయాడు. తన తల్లిని దాస్యం నుండి విముక్తిరాలిని చేయవల సిందని సవితితల్లినికోరాడు గరుత్మంతుడు. తనకు అమృతం తెచ్చి ఇస్తే నీ సవితితల్లి సుపర్ణిని తనదాస్యంనుండివిడుదలచేస్తానంది. మాతృసేవాపరాయుణడైన గరుత్మం తుదా అమృతం తెచ్చి సవితి తల్లికిచ్చి తల్లిని దాస్యం నుండి విడుదల చేసాడు.

బలపరాక్రమములు కలిగినవాడు మాతృభక్తిగలవాడు బలసంపన్నుడు కార్యశూరుడు వీరుడుఅయిన గరుత్మంతుని కొలచినవారికి కొదవుఉండదు భయాందోళనలుండవు కనక ఆ మహానీయుడ్ని ఆరాధించే నోము ఇది నోచుకున్న వారికి ఏవిధమగు వ్యాధి ఉండదు. సుమంగళులై తరిస్తారు. సుపుత్రులు కలుగుతారు. పంచమి నాడు ఈ నోము నోచి సుమంగళులకు ఫలపుష్ప, తాంబూలాలివ్వాలి.

## 118. ఇష్టకామేశ్వరి నోము కథ

అవంతీపురంలో సుగమశర్మ అనబడేవిప్రుడునివసిస్తుండేవాడు. అతనికి రంజని అనే కుమార్తె ఉండేది. ఆమె శివభక్తురాలు చిన్నప్పటినుండి ఆటపాటలతో శివనామ సంకీర్తనలు శివభజనలు చేస్తుండేది. సౌందర్యవతి, సుగుణవతి భక్తి జ్ఞాన సంపన్నురాలు అయిన ఆకుమార్తెకు తగినవరునికొరకై దేశ దేశాలు అన్వేషిస్తుండేవాడు సుగమ శర్మ.

తండ్రీ ! నా వివాహంగురించివిచారించకు నేను పరమేశ్వరుడ్నితప్ప అన్యులను వివాహం చేసుకోను నీ ప్రయత్నం విరమించుకో ఆపరమేశ్వరునకు నాయందు అభిమానం కలిగినప్పుడు వచ్చి నన్ను స్వీకరిస్తాడని చెబుతుండేది. పరమేశ్వరా ! నన్నునీ సతిగా అనుగ్రహించని నిరంతరం పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తుండేది. ఒకనాడొక సిద్ధుడు వచ్చి బిడ్డా శివానుగ్రహం నీకు కలుగుతుంది. అందుకు తోడుగా నువ్వు ఇష్టకామేశ్వరీ నోము చేస్తే నీ కోర్కె తొందరలో సిద్దిస్తుందని ఆనోము విధివిధానాలతను వివరించాడు.

అందుమీదట ఆమె ఇష్టకామేశ్వరీ విగ్రహాన్ని చేయించి భక్తితో ఇష్టకామేశ్వరి వ్రతం చేసింది. కామేశ్వరి అనుగ్రహంతో శివానురాగం అమెకు సిద్ధించింది. ఒకనాడు పరమేశ్వరుడు నందివాహనంపైవచ్చిరంజనికిచేయూతనిచ్చితనవాహనంపైకెక్కించాడు. పరమేశ్వరునిచే పరిగ్రహించబడిన రంజని తండ్రిని ఉద్దేశించి జనకానాకొరకై నీవింకవరునివెదక వలసిన పనిలేదు. కైలాసపతినన్ను అనుగ్రహించాడు అనిపలికి శివుని వెంట కైలాసానికి వెళ్ళింది.

**ఉద్యాపన :-** కామేశ్వరీ ప్రతిమను మట్టితోగాని లేదా మరేలోహంతోగాని తయారు చేసి పూజామందిరంలో ఉంచుకుని పళ్ళుచలిమిడి నివేదించి పూజ చేసి ముత్తైదువునకు వాటిని పసుపు కుంకుమ రవికెలగుడ్డతో వాయనమిచ్చి వాళ్ళ ఆశీస్సులు పొందాలి.

## 119. శ్రీరామ నోము కథ

ఒకేమాట ఒకేబాణం ఒకేసతి అన్ననియమానికి కట్టుబడిన ఆదర్శపురుషుడు శ్రీరాముడు సుగుణగుణాభిరాముడు దుష్టరాక్షసులనుచంపి శిష్టులనుబ్రోచినవాడు అయోధ్య రాముడు ఈ మహానీయుని జన్మదినమైన చైత్ర శుద్దనవమినాడు అనగా శ్రీరామనవమినాడు శతృఘ్నసమేతంగా పూజాపీటంపై ఉంచి షోఢశోపచారాలతో అష్టోత్తర స్తోత్రనామాలతో పూజించాలి. పిండివంటలువడపప్పు పానకం స్వామికి నివేదించాలి. అనంతరం నలుగురికి షడ్రసోపేతంగా భోజనం పెట్టాలి. ఆరాత్రి రామాయణ పారాయణలతో గడపాలి.

అలాచేసినవారికిశతృభయంతొలగిపోతుంది. కార్యసిద్ది కలుగుతుంది. కళ్యాణ కరంగా జీవితం సాగుతుంది. ముక్తి మోక్షం సంప్రాప్తిస్తాయి.

## 120. కన్యాకుమారి నోము కథ

పూర్వకాలంలో కుంతలనగరంలోశివశాస్త్రి అనబడే సద్బ్రాహ్మణుడుండేవాడు. విద్యావంతుడు, గుణవంతుడు,సదాచార సంపన్నుడైన శివశాస్త్రికి సంతానం లేదు. ఎన్ని సంపదలున్నా ఎన్ని సౌకర్యాలున్నా పున్నామ నరక సంరక్షకుడైనపుత్రుడు లేకపోవడం తీవ్రమైన వెలితిగా భావించి ఆ విప్రోత్తముడునిరంతరం విచారిస్తుండేవాడు. నిత్యంఏదో ఒకక్షేత్రానికివెళ్ళిపుణ్యతీర్థాలలోస్నానంచేసిదైవదర్శనం చేసుకుంటుండేవాడు. ఎంతకి అతని

కోర్కెతీరే మార్గంకలగలేదు. తన గ్రామానికి తన ఇంటికి వచ్చిన విద్వత్ జనులందరితో తనకు సంతానంలేనికొరతను చెప్పి ఏదైనా పూజా వ్రతము చెప్పమని వేడుకుంటుండేవాడు. భవిష్యత్ జ్ఞానసంపన్నుడైన జ్యోతిష్యపండితుడొకాయన ఒకనాడుశివశాస్త్రి ఇంటికి వచ్చాడు. వానికి సకలోపచా రాలు చేసి అతిధ్యమిచ్చిదక్షిణతాంబూలాలుసమర్పించి లోకాభి రామాయణం ముచ్చటిస్తూ శివశాస్త్రి తనకు సంతానంలేదని తానెంతగా దేవతలను ఆరాధించినా సంతానం కలుగకపోవడానికి గలకారణాన్ని వివరించగలదైవజ్ఞులుమీరేనని నమ్ముకుంటున్నాను నాయందు అనుగ్రహముంచికారణాన్ని మార్గాన్ని తెలియ చెప్పండి అని ప్రార్థించాడు.

జ్యోతిష్యశాస్త్ర పండితుడు ప్రశ్నాకాలాన్ని అతని జన్మనక్షత్ర తిథివార సమయాలను గుణించి మనోనేత్రంలో ఆవిప్రునిగత జన్మవిశేషాలను ఆకళించుకుని వానితో ఈ విధంగా అన్నాడు. ఓయీ! శివశాస్త్రిగత జన్మమునందు పిల్లలను చేరదియ్యకపోగా వాళ్ళను కసురుకుంటూ వాళ్ళ ఆటపాటలను అడ్డగిస్తూ చాలా క్రూరంగా వ్యవహరించే వాడివి అందువల్ల ఆపిల్లలు నిన్ను పరిపరివిధాలా తిట్టుకునేవారు. బాలవాక్కు బ్రహ్మవాక్కు గదావాళ్ళ తిట్లుతో దొర్లిన శాపపూర్వకమైన మాటలు నిన్ను పట్టి పీడిస్తున్నాయి. ఎంతగా ప్రయత్నించినా ఎంతమంది దేవుళ్ళకు మ్రొక్కుకున్నా గత జన్మలో బాలలుపలికి వాక్కులు శాపాలైనిన్ను ఇలా దుఃఖింపచేస్తున్నాయి.

ఆ మాటలు విన్న శివశాస్త్రి అయ్యా ఆ పాపం తొలగినాకు పుత్ర స్థితికలిగే మార్గం చెప్పండని కోరుకున్నాడు. ఓ విప్రోత్తమా కన్యాకుమారివ్రతం అనబడే వ్రతమొకటి ఉన్నది. ఆమె ఈప్సితసిద్ధినికలుగజేయు దేవత ఆమె వ్రతం దివ్యమైన వ్రతం నువ్వు నీ భార్యచేత ఆ కన్యాకుమారివ్రతం చేయించు నీ కోరిక సిద్ధిస్తుందని చెప్పి వెళ్ళిపోయాడు. త్రికాలవేది. అతడుచెప్పిన ప్రకారం శివశాస్త్రి తన భార్యచేత కన్యాకుమారి వ్రతం చేయించి రత్నాలవంటి పుత్రుల్ని పొందాడు.

**ఉద్యాపన :-** కార్తీకశుద్ధపూర్ణిమ నాడు తలస్నానం చేసి గృహంలో తూర్పు ఈ శాన్యం దిక్కున కన్యాకుమారిని ఉంచి ఆ ప్రతిమకు అభిషేకం చేసి పూజచెయ్యాలి. అలావరుసగా శ్రావణ పౌర్ణమి నాటివరకు తొమ్మిది పౌర్ణమిదినాలు పూజ చేసి ఆఖరున శ్రావణ పౌర్ణమి నాడు తొమ్మిది చలిమిడి ఉండలు తొమ్మిది అరటిపళ్ళు తొమ్మిది రవికలగుడ్డలు పసుపు కుంకుమపొట్లాలతోతొమ్మిదిమంది సుమంగళులకు సమర్పించి వారి ఆశీస్సులు పొందాలి. సంతానాన్ని ముక్తిపథాన్ని అనుగ్రహించే వ్రతమిది.

## 121. రాధాదేవి నోము

కార్తీక శుక్లద్వాదశినాడు రాధాదేవిని సాలగ్రామంమీదగాని, కలశపాత్రయందుగాని అష్టదళ యంత్రముమీదగాని ఆవాహనచేసి ఆతరువాత షోడశోపచారపూజలు జరిపించి పాయసం నైవేద్యంగా పెట్టాలి. అనంతరం రాధాదేవిని ఈ విధంగాస్తుతించాలి.

శ్లో॥ నమస్తే పరమేశాన రాసమండల వాసిని
రాజేశ్వరి నమస్తేస్తు కృష్ణప్రాణాధిక ప్రియే

**ఉద్యాపన :-** పైమంత్రాన్ని చెప్పి ఒక ముత్తైదువుకు దక్షిణ తాంబూలాలు ఇచ్చి నమస్కరించాలి. ఒక బ్రాహ్మణునికి పాయసంతో భోజనం పెట్టి దక్షిణ తాంబూలాలతో సత్కరించాలి. (దీనిని సాయంత్రం వేళలో చేయాలి)